అడ్డగోలు తూకాలు..

- 42 కిలోలు తీసుకొని 40 కిలోలకు మాత్రమే ట్రక్‌షీట్
- తప్పని పరిస్థితుల్లో ధాన్యాన్ని విక్రయిస్తున్న రైతన్నలు



సదాశివనగర్‌లో ధాన్యం తూకం చేస్తున్న కూలీలు

సదాశివనగర్: ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికి వచ్చిన తర్వాత రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో నిబంధనల ప్రకారం 40.100 కిలోల చొప్పున ధాన్యాన్ని తూకం వేయాల్సి ఉండగా చాలా చోట్ల 42 కిలోలు తీసుకుంటున్నారు. అయితే 40 కిలోల చొప్పున లెక్కగట్టి ట్రక్‌షీట్ రాస్తున్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో అడ్డగోలుగా తూకాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అన్యాయాన్ని ప్రశ్నిస్తున్నా న్యాయం జరగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తప్పని పరిస్థితుల్లో విక్రయించాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు రైతులు చెబుతున్నారు. అకాల వర్షాల కారణంగా ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. అనుకున్న మేరకు పంట దిగుబడి రాక ఒక వైపు దిగులు చెందుతుంటే మరో వైపు అకాల వర్షాలతో తీవ్ర నష్టం వాటిల్లింది. దీనికి తోడు కొనుగోలు కేంద్రాల్లో తూకాలు వేసే సమయంలో ఒక్కో బస్తాకు అనధికారికంగా అదనంగా రెండు కిలోలు తీసుకుంటుండటంతో రైతులు మరింత నష్టపోతున్నారు. ఇప్పటికే అకాల వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం మొలకలు వస్తుండడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. నష్టానికి తోడు కేంద్రాల్లోని నిర్వహకులు అధికంగా తూకం వేయడం, మిల్లర్లు సాకులు చెబుతూ కోతలు పెట్టడం మరింత నష్టం వాటిల్లుతుందని రైతులు పేర్కొంటున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు దృష్టి సారించడంలేదని రైతులు పేర్కొంటున్నారు.

జాలి పట్టలేదనే..

జాలి పట్టకుండా, తేమ శాతం ఎక్కువ ఉన్న ధాన్యాన్ని మాత్రమే 42 కిలోలు తీసుకుంటున్నాం. జాలి పడితే 40.700 కిలోలు తీసుకుంటున్నాం. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు మిల్లులకు తరలిస్తున్నాం.
–విఘ్నేశ్ గౌడ్, విండో సీఈవో, సదాశివనగర్

లారీలు రావు.. బస్తాలు పోవు



బూర్గుల్ కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం నిల్వలు

నిజాంసాగర్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం బస్తాల నిల్వలు పేరుకుపోతున్నాయి. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు లారీలు అందుబాటులో లేకపోవడంతో కాంటాలు వేసిన ధాన్యం బస్తాలు రోజుల తరబడి అక్కడే ఉంటున్నాయి. దీంతో రైతులు ధాన్యం బస్తాల ఎప్పుడు తరలిస్తారోనని కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారు. కొన్నిచోట్ల అధికారులు రోడ్లపై నిలబడి ఖాళీగా వచ్చే లారీలను బలవంతంగా తెచ్చి ధాన్యాన్ని తరలించే పరిస్థితులు నెలకొన్నాయి.

నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని తూకం వేస్తున్నా లారీలు రాకపోవడంతో 5 వేల ధాన్యం బస్తాలు కేంద్రాల్లోనే నిల్వ ఉన్నాయి. బ్రహ్మణపల్లి కొనుగోలు కేంద్రంలో నాలుగు రోజుల కిందట తూకాలు వేసినా ఒక్క బస్తా కూడా మిల్లులకు చేరలేదు.

రోడ్లపై పడిగాపులు

కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించేందుకు లారీల కొరత ఉంది. లారీల కోసం ట్రాన్స్‌పోర్టు అధికారులతో కలిసి రోడ్లపై పడిగాపులు కాస్తున్నాం.
– నారాయణ, తహసీల్దార్, నిజాంసాగర్

ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణం



పిట్లంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న అధికారులు

పిట్లం: వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదని బాన్సువాడ ఆర్టీసీ డిపో మేనేజర్ సదాశివ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం పోలీస్, ఆర్టీసీ సిబ్బందితో కలిసి మండలంలో ప్రైవేట్ వాహనాలను నిరోధించేందుకు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. మద్దెల్‌చెరు గ్రామం వద్ద ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తుండటంతో ప్రమాదకర ప్రయాణాలు చేయవద్దని ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షితంగా ప్రయాణం చేయాలని అవగాహన కల్పించారు. అనంతరం వారిని ఆర్టీసీ బస్సులో పంపారు. కార్యక్రమంలో ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ బన్సీలాల్, సిబ్బంది రాములు, పోలీస్ సిబ్బంది ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి



ఉత్తునూర్‌లో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్

సదాశివనగర్: కంటి సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరు పరీక్షలు చేయించుకోవాలని ఎమ్మెల్యే జాజాల సురేందర్ సూచించారు. శుక్రవారం మండలంలోని ఉత్తునూర్ గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోతె సాయవ్వ రాములు, ఉప సర్పంచ్ శివపాటిల్, ఎంపీటీసీ రాంచందర్ రావు, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు శ్రీకాంత్ రావు పాల్గొన్నారు.
దోమకొండ: మండలంలోని గొట్టిముక్కుల గ్రామంలో జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభించారు. సర్పంచ్ దర్పల్లి సునీత, ఎంపీడీవో చిన్నారెడ్డి, ఎంపీవో తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ ఆసాని జ్యోతి తదితరులు పాల్గొన్నారు.
లింగంపేట: మండలంలోని పోతాయిపల్లి, రాంపల్లి తండా, ఒంటర్‌పల్లి గ్రామాల్లో కంటి వెలుగు శిబిరాలను ఆయా గ్రామ సర్పంచ్‌లు లక్ష్మీనారాయణ, రాజయ్య ప్రార ంభించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు హిమబిందు, యాదగిరి పాల్గొన్నారు.
మాచారెడ్డి : మండలంలోని గజ్యానాయక్ తండా గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచ్ హంజీనాయక్ కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి ఒక్కరు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తోకల కిషన్, మండల కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్లకు మహర్దశ



సదాశివనగర్‌కు వెళ్లే రోడ్డు

సదాశివనగర్: మండలంలోని ఉత్తునూర్, మర్కల్, పద్మాజివాడి గ్రామాల్లో బీటీ రోడ్లకు మహర్దశ వచ్చింది. గుంతలు పడటంతో కొన్నేళ్లుగా ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉత్తునూర్ నుంచి యాచారం వరకు రూ. 71 లక్షలు, పద్మాజివాడి రోడ్డుకు రూ. 8 లక్షలు, మర్కల్, తిర్మన్‌పల్లి గ్రామాల బీటీ రోడ్డు కోసం రూ. 50 లక్షలు ఖర్చు చేసి మరమ్మతులు చేయించడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సరంపల్లికి 33 అడుగుల మట్టి రోడ్డు..
కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని సరంపల్లి గ్రామానికి కొత్త గ్రామ పంచాయతీ నుంచి చెరువు కట్ట వరకు 33 అడుగుల మట్టి రోడ్డు వేశారు. ఇందుకు సహకరించిన పొలం పట్టాదారులకు కౌన్సిలర్ ఆకుల రూప రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

కల్యాణ మండపం నిర్మాణానికి భూమి పూజ



పనులు ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి

బాన్సువాడ: మండలంలోని సోమేశ్వర్‌లో శుక్రవారం కల్యాణ మండపం నిర్మాణానికి డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి భూమి పూజ చేశారు. పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల కోసం కల్యాణ మండపాలు నిర్మిస్తోందని నియోజకవర్గంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో ఇప్పటి వరకు రూ. 50 కోట్లతో 80 కల్యాణ మండపాలు నిర్మించినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో సర్పంచి పద్మమొగులయ్య, నాయకులు గులెపల్లి మొగులయ్య, అంజిరెడ్డి, ఎజాస్, మోహన్‌నాయక్, విరేశం, బీమా గంగారం. పసుపుల సాయిలు తదితరులు ఉన్నారు.

విద్యార్థినికి సన్మానం..
ఇంటర్ బైపీసీలో 994 మార్కులు సాధించిన ఉమ్రా మహవీన్‌ను శుక్రవారం డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి సన్మానించారు.

ఝాన్సీ అరెస్టు అన్యాయం



ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

కామారెడ్డి అర్బన్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీని పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఏబీవీపీ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక నిజాంసాగర్ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ప్రభుత్వ గుర్తింపు లేని హైదరాబాద్‌లోని గురునానక్ యూనివర్సిటీలో 4 వేల మంది విద్యార్థులను అడ్మిషన్లు చేసుకోవడంతో ఆయోమయానికి గురౌతున్న తల్లిదండ్రులకు మద్దతుగా పోరాటం చేస్తున్న ఝాన్సీని పోలీసు అరెస్ట్ చేసి దాడి శోచనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో వరుణ్, రుషి, సాత్విక్, సందీప్, అభిషేక్, సతీష్, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

నిండిపోయిన డ్రైయినేజీలు



కాద్లాపూర్‌లో పేరుకుపోయిన డ్రైయినేజీ

బాన్సువాడ రూరల్: జూనియర్ పంచాయితీ కార్యదర్శులు సమ్మెబాట పట్టడంతో పాలన అస్తవ్యస్తంగా మారింది. గ్రామాల్లో పారిశుధ్య సిబ్బంది డ్రయినేజీలు క్లీన్ చేయకపోవడంతో చెత్తాచెదారంతో నిండి దుర్వాసన వెదజల్లుతున్నాయి. మండలంలోని కాద్లాపూర్, సంగ్రాంతండా, జక్కల్‌దాని తండా, రాంపూర్, తాడ్కోల్ గ్రామాల్లో డ్రైనేజీలు శు భ్రం చేయక కంపు కొడుతున్నాయని ఆయా గ్రామాలకు చెందిన పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

కలుషిత నీరే దిక్కు



సంగ్రాం తండాలో నాచుతో పేరుకుపోయిన నీటితొట్టె, చుట్టూ చేరిన నీరు

బాన్సువాడ రూరల్: మూగజీవాల దాహార్తి తీర్చేందుకు గ్రామాల్లో నిర్మించిన నీటి తొట్టెలు శుభ్రం చేయకపోవడంతో నాచుతో పేరుకుపోయాయి. కలుషిత నీరు తాగిన పశువులు రోగాల బారిన పడ్తున్నాయి. పంచాయతీ పాలకవర్గాలు స్పందించి నీటితొట్టెలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని పాడిరైతులు కోరుతున్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ..



క్రీడాకారులతో మాజీ మంత్రి షబ్బీర్ అలీ

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి భారత్ రోడ్‌లోని బ్యాడ్మింటన్ అకాడమి నాల్గవ వార్షికోత్సవం సందర్భంగా ప్రారంభించిన వేసవి శిబిరంలో పాల్గొనే క్రీడాకారులకు శుక్రవారం మాజీ మంత్రి షబ్బీర్ అలీ టీ షర్టులు, స్కిప్పింగ్ రోప్‌లను అందజేశారు. స్థానికంగా ఉన్న ఇందిరా గాంధీ స్టేడియంను జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసి అండర్–19 క్రికెట్ పోటీలు నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కై లాస్ శ్రీనివాస్‌రావు, కౌన్సిలర్లు పాత శివకృష్ణమూర్తి, అన్వర్ అహ్మద్, నాయకులు పండ్ల రాజు, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముదిరాజ్ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక



ముదిరాజ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు

భిక్కనూరు: మండల ముదిరాజ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గంగళ్ల స్వామి, ఉపాధ్యక్షుడిగా బోయిని చిన్న నాగభూషణం, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంతం మాణిక్యం ఎన్నికయ్యారు. సభ్యులుగా నీల స్వామి, గంగళ్ల వేణు, బండి రమేశ్, బాసం స్వామి, నంద లింగం, ఉప్పరి లింబాద్రిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం సలహాదారులు గజ్జెల భిక్షపతి, నంద రమేశ్, దేవుని సాయిలు, పున్న లక్ష్మినారాయణ, గంగళ్ల భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా పెద్దమ్మ తల్లి కల్యాణం



కామారెడ్డి రూరల్: మండలంలోని గర్గుల్ గ్రామంలో శుక్రవారం పెద్దమ్మ అమ్మవారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్, బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణా రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయం అందిస్తానని గంప గోవర్ధన్ వెల్లడించారు. అనంతరం గ్రామంలో ఐమాస్ట్ లైట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు, సర్పంచ్ చింతల రవితేజ గౌడ్, లోయపల్లి నర్సింగ్‌రావు, శంకర్‌గౌడ్, బీంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ

రాజంపేట: మండలం పెద్దాయిపల్లిలో వనదుర్గ పెద్దమ్మ ఆలయ నిర్మాణానికి ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్దవ్వ, ఆలయ కమిటీ అధ్యక్షుడు ఈర్ల రాజయ్య, ఉపాధ్యక్షుడు బోయిని స్వామి, ప్రధాన కార్యదర్శి బోయిని నర్సింలు, రైతుబంధు అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ఆర్గొండ ఎంపీటీసీ సాగర్, బీఆర్ఎస్ నాయకులు ఈర్ల నర్సింలు, బోయిని స్వామి తదితరులు పాల్గొన్నారు.



బొరడి పోచమ్మకు బోనాలు



పెద్దకొడప్‌గల్: మండల కేంద్రమైన పెద్దకొడప్‌గల్ గ్రామ దేవత పోచమ్మకు బోనాలు సమర్పించారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనం ఎత్తుకొని ఆలయానికి ఊరేగింపుగా వెళ్లారు.

వైభవంగా వీరాంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన

కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి దేవివిహార్‌లో వీరాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి షబ్బీర్‌అలీ ముఖ్య అతిథిగా హాజరై పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఇంద్రకరణ్‌రెడ్డి, బీమ్‌రెడ్డి, గణేష్‌నాయక్, పండ్ల రాజు, ఐరేని సందీప్, గుడుగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీనర్సింహస్వామి విగ్రహం..



మాచారెడ్డి : మండలంలోని చుక్కాపూర్ గ్రామంలో పునర్నిర్మించిన శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎంపీపీ నర్సింగరావ్, జెడ్పీటీసీ రాంరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, సర్పంచ్ సౌజన్య, ఎంపీటీసీ రూపాదేవి పాల్గొన్నారు.

దాబాల్లోనే సిట్టింగ్..

పిట్లం: మండలంలోని ప్రధాన రహదారుల పక్కన ఉన్న దాబా హోటళ్లలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం సిట్టింగ్‌లు కొనసాగిస్తున్నా రు. ఎక్సైజ్ సిబ్బందే ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. నిజాంసాగర్ మండలంలోని నర్సింగ్‌రావ్ పల్లి చౌరస్తా నుంచి మద్నూర్ మండలం వరకు జాతీయ రహదారి ఉండడంతో వాహనాలు మితిమీరిన వేగంగా వెళ్తుంటాయి. ఈ రహదారి వెంబడి పదుల సంఖ్యలో ఉన్న దాబా హోటళ్లలలో మద్యం సేవించి మత్తులో వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణం అవుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా సిట్టింగ్‌లు కొనసాగుతున్నాయి. దాబా హోటళ్లలలో మద్యం తాగడానికి ఎలాంటి అనుమతులు లేవు కొంతమంది దాబాల నిర్వాహకులు మద్యంను విక్రయిస్తున్నా అడిగేవారు లేరు.




పిట్లం దాబాల్లో తాగి పడేసిన మద్యం బాటిళ్లు, దాబాలో తాగుతున్న మందుబాబులు

క్లుప్తంగా

గుర్తింపులేని పాఠశాలల్లో చేర్పించొద్దు

కామారెడ్డి రూరల్: ప్రభుత్వ గుర్తింపు లేని పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించొద్దని ఎంఈవో ఎల్లయ్య తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. కామారెడ్డి పట్టణంలోని హైటెక్ పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు లేదని తెలిపారు.

కాలుష్యాన్ని నివారించాలి



భిక్కనూరు: మండలంలోని కాచాపూర్ గ్రామంలో ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ ద్వారా వెలువడుతున్న కాలుష్యాన్ని నివారించేందుకు చర్యలు తీసుకోవాలని వీడీసీ ఆధ్వర్యంలో చేస్తున్న నిరసన దీక్షలు 18వ రోజుకు చేరాయి. శుక్రవారం చేపట్టిన నిరసన దీక్షలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు కూర్చొన్నారు.

బీమా చెక్కు అందజేత



కామారెడ్డి అర్బన్: తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఖాతా ఉన్న కె.నరేందర్ అనే వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందడంతో బాధిత కుటుంబ సభ్యులకు రూ. 20 లక్షల ప్రమాద బీమా చెక్కును బ్యాంక్ రీజినల్ మేనేజర్ నవీన్ అందజేశారు. ఏడాదికి రూ. వెయ్యి ప్రీమియం చెల్లిస్తే రూ.20 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ దుర్గా, సిబ్బంది ప్రవీణ్, స్వప్న, ప్రవంతి, నయిమ్, చింతామణి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి



నాగిరెడ్డిపేట: పదోన్నతులు కల్పించాలని మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వీఆర్ఏలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ సయ్యద్ అహ్మద్ మస్రూర్‌కు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు వీఆర్ఏల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఆర్ఏ జేఏసీ నాయకులు సురేందర్, శ్రావణ్, సాయిలు పాల్గొన్నారు.

వాటరింగ్ డే

దోమకొండ: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శుక్రవారం వాటరింగ్ డే కార్యక్రమం సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు మొక్కలకు నీళ్లు పోశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద, సర్పంచ్ దర్పల్లి స్వరూప, ఎంపీడీవో చిన్నారెడ్డి, ఎంపీవో తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ ఆసాని జ్యోతి పాల్గొన్నారు.

మూడు రోజుల పాటు సీఎం కప్ క్రీడా పోటీలు

పెద్దకొడప్‌గల్: మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణంలో 15వ తేదీ నుంచి 17 వరకు సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాణి తెలిపారు. 15 నుంచి 36 ఏళ్లలోపు వయస్సున్న యువతీ, యువకులు పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. పంచాయతీల వారీగా జట్టుగా ఏర్పడి ఎంపీడీవో కార్యాలయంలో వివరాలు అందజేయాలని ఆమె వెల్లడించారు.

ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్ల పంపిణీ

కామారెడ్డి అర్బన్: బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పెళ్లి రోజు సందర్భంగా సంఘం జిల్లా నాయకులు శుక్రవారం జిల్లా ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రుణాల కోసం ఇంటర్వ్యూలు

ఎల్లారెడ్డిరూరల్: మైనారిటీ కార్పొరేషన్ ద్వారా రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. దరఖాస్తులు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నారాయణ, ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

రేపు కుస్తీ పోటీలు

పెద్దకొడప్‌గల్: బొరడి పోచమ్మ పండుగ సందర్భంగా ఆదివారం పెద్దకొడప్‌గల్‌లో కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. పోటీల్లో మల్లయోధులు పాల్గొనాలని కోరారు.

అన్ని రంగాలలో ప్రభుత్వం విఫలం

ఎల్లారెడ్డి రూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలమైందని టీజేఎస్ నాయకులు నిజ్జన రమేష్ ఆరోపించారు. శుక్రవారం మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో జనచైతన్య యాత్ర కార్యక్రమంలో భాగంగా ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.

నర్సుల సేవలు అభినందనీయం

ఎల్లారెడ్డి: నర్సుల సేవలు అభినందనీయమని ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్రమోహన్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సిబ్బందిని సన్మానించారు.